క్లుప్తంగా

నేడు ఎమ్మెల్యే రమణమూర్తిరాజు పర్యటన

మునగపాక : మునగపాకలో బుధవారం యలమంచిలి ఎమ్మెల్యే యు.వి. రమణమూర్తిరాజు పర్యటిస్తారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. మునగపాక నుంచి కశింకోట మండలం వెదురుపర్తి వరకు నూతనంగా నిర్మించిన బీటీ రోడ్డును ఆయన మధ్యాహ్నం 1 గంటకు ప్రారంభిస్తారన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు కార్యక్రమానికి హాజరుకావాలని అచ్చియ్యనాయుడు కోరారు.

8న ప్రత్యేక భజనలు

మునగపాక : మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా మునగపాక సాంబశివుని ఆలయంలో ప్రత్యేక భజన కార్యక్రమాలు ఉంటాయని గురుస్వామి మాడెం జోగారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 8వ తేదీ రాత్రి 8 గంటల నుంచి 10 గంటల వరకు భజన ఏర్పాటు చేసినట్టు తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి భజన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జోగారావు కోరారు.

వదలని పొగమంచు



కోటవురట్లలో దట్టంగా అలుముకున్న పొగమంచు

కోటవురట్ల : ఎండలు మండిపోయి ఉష్ణోగ్రత లు పెరిగినా పొగమంచు వదిలి పెట్టడంలేదు. మైదానమైనా ఏజెన్సీని తలపించే పొగమంచు పల్లెలను కమ్మేస్తోంది. ఉదయం 8 గంటల వరకు దట్టంగా అలుముకున్న పొగమంచుతో రైతులు, విద్యార్థులు, వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. జీడి, మామిడి తోటలు పిందెతో ఏపుగా ఉన్న తరుణంలో పొగమంచు వల్ల నష్టం తప్పదని రైతులు కలవరపడుతున్నారు. పొగమంచు కారణంగా మామిడి పిందెలను తేనె మంచు పురుగు ఆశించే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

పాము కాటుకు మహిళా కూలీ మృతి



కొమర ధర్మ(ఫైల్)

రాంబిల్లి : హరిపురంలో మంగళవారం పాము కాటుకు మహిళా కూలీ మృతి చెందారు. హరిపురానికి చెందిన కొమర ధర్మ(32) బీసీటీ ఫాంలో పని చేసేందుకు వెళ్లగా పాముకాటుకు గురయ్యారు. ఈమెను అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్టు కుటుంబసభ్యులు తెలిపారు. ఆమెకు భర్త రాజు , ఒక కుమార్తె ఉండగా కుమార్తెకు ఏడాది క్రితం పెళ్లి చేశారు. మృతురాలి కుటుంబ సభ్యులను ఆదుకోవాలని ఆమె కుటుంబసభ్యులు, హరిపురం గ్రామస్తులు కోరారు.

650 లీటర్ల బెల్లం పులుపు ధ్వంసం



స్వాధీనం చేసుకున్న ప్లాస్టిక్ డ్రమ్ములు

పాయకరావుపేట : నక్కపల్లి మండలం చినగొడ్డిగొల్లు గ్రామ పరిసరాల్లో దాడులు నిర్వహించి సారా కాపు స్థావరాలపై దాడులు చేసి 650 లీటర్లు సారా తయారీ బెల్లం పులుపును ధ్వంసం చేసినట్టు ఎస్ఈబీ సీఐ ధర్మారావు తెలిపారు. సామగ్రి నిల్వ చేసిన పాత్రలను స్వాధీనం చేసుకున్నామన్నారు. సారా బట్టీలను ధ్వంసం చేసి పులుపును పారబోసి పాత్రలను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ ధర్మారావు తెలిపారు.

సత్రం గౌరవాధ్యక్షునిగా రామసత్యనారాయణ

అనకాపల్లి : స్థానిక చిన్నవీధికి చెందిన విశ్రాంత అధ్యాపకుడు డాక్టర్ రేపాక రామసత్యనారాయణ ఈనెల 3న తమిళనాడులోని అరుణాచలం ఆర్య వైశ్య నిత్యాన్న సత్రం గౌరవాధ్యక్షునిగా ఎన్నికై అనకాపల్లి తిరిగి వచ్చిన సందర్భంగా ఆయనను మంగళవారం సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనకాపల్లిలో జన్మించిన తను అరుణాచలం ఆర్య వైశ్య నిత్యాన్న సత్రానికి గౌరవాధ్యక్షునిగా ఎన్నిక కావడం అదృష్టమన్నారు. సత్రం అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అభయాంజనేయ ఆలయ వార్షికోత్సవం



స్వామికి సింధూర పూజలు



కోలాటం నిర్వహిస్తున్న చిన్నారులు

ఎస్.రాయవరం : అడ్డురోడ్డు కూడలిలో వేంచేసి ఉన్న అభయాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. సోమవారం చిన్నారులతో కోలాటం, హరిభజనలు నిర్వహించారు. మంగళవారం వేకువ జాము నుంచి స్వామి ప్రధాన విగ్రహానికి అభిషేకాలు నిర్వహించి భక్తిని చాటుకున్నారు. ఆలయ ప్రాంగణంలో మహిళలు పెద్ద ఎత్తున వరుస క్రమంలో కూర్చుని సింధూర పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో మధ్యాహ్నం భారీ అన్న సమారాధన నిర్వహించారు. మూడు మండలాలకు ప్రధాన జంక్షన్ కావడంతో ఈ వార్షికోత్సవాల్లో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. స్థానిక వర్తక సంఘ సభ్యులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేసి వార్షికోత్సవాన్ని జాతరలా నిర్వహించారు.



ప్రత్యేక పూజలందుకున్న అభయాంజనేయస్వామి

వైభవంగా శూలాల సంబరం



శూలాల సంబరంలో భక్తులు



స్వామివారిని దర్శించుకుంటున్న సమన్వయకర్త కంబాల జోగులు

నక్కపల్లి: మండల కేంద్రంలో శూలాల సంబరం సోమవారం రాత్రి అంబరాన్నంటింది. ఈ సందర్భంగా పద్మశాలీలు తమ ఆరాధ్య దైవంగా కొలిచే శ్రీ భద్రావతి సమేత భావనారుషి కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. తెల్లవార్లు నక్కపల్లి బందారు పేట, అద్దాలవీది, ఉపమాకరోడ్డు, వీవర్స్ కాలనీ తదితర ప్రాంతాల్లో సందడి నెలకొంది. నాలుకపై శూలాలు గుచ్చుకుని నృత్యాలు చేస్తూ భక్తులంతా సందడి చేశారు. భారీ ఊరేగింపు నిర్వహించారు. నేల వేషాలు, బళ్లవేషాలు, తీన్మార్ డాన్సులు, కోలాటాలతో నక్కపల్లి పట్టణమంతా తిరునాళ్లను తలపించింది. మండలంలోనే ఎంతో ప్రాముఖ్యత గాంచిన నక్కపల్లి శూలాల సంబరాన్ని తిలకించేందుకు ఉపమాక, సారిపల్లిపాలెం, మనబానవారిపాలెం అడ్డురోడ్డు తదితర గ్రామాలనుంచి వందలాది మంది తరలివచ్చారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించారు. ఆలయం వద్ద భక్తులు వందలాదిగా తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని కానుకలు మొక్కుబడులు సమర్పించుకున్నారు. స్వామివారిని నియోజకవర్గ సమన్వయకర్త రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు, రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరక్టర్ వీసం రామకృష్ణ, వైస్ ఎంపీపీ నానాజీ దర్శించుకున్నారు.

నేడు సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు

నక్కపల్లి : ఈనెల 6వ తేదీన మాఘ బహుళ ఏకాదశి పురస్కరించుకుని నక్కపల్లిలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహిస్తున్నట్టు తాలూకా బ్రాహ్మణ సంఘ ప్రతినిధులు డి.వి.రామారావు, శ్రీపాద ప్రణవ్‌రామ్ తెలిపారు. ప్రముఖ వేదపండితుల ఆధ్వర్యంలో ఉదయం 9 గంటలకు సుబ్బరామిరెడ్డి కల్యాణమండపంలో నిర్వహించే వ్రతాల్లో పాల్గొనే దంపతులు సంఘం వారికి రూ.1116 చెల్లించి పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు. వ్రతంలో పాల్గొనే వారికి పూజాసామగ్రి, స్వామివారి ప్రతిమ, కండువ, జాకెట్టు ముక్క నిర్వాహకులే సమకూరుస్తారన్నారు. వ్రతం అనంతరం భోజన సదుపాయం ఉంటుందని తెలిపారు. వ్రతంలో పాల్గొన దలచిన వారు 9242385O5, 9299998926 నంబర్లలో సంప్రదించాలని లేదా నేరుగా కల్యాణ మండపం వద్దకు వచ్చి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

మడుతూరులో నూకాంబిక అమ్మవారి పండగ



నూకాంబిక అమ్మవారి సన్నిధిలో డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమార వర్మ

అచ్యుతాపురం : మండలంలోని మడుతూరులో నూకాంబిక అమ్మవారి పండగ మంగళవారం ఘనంగా నిర్వహించారు. డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు. స్థానిక సర్పంచ్, ఎంపీటీసీ, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

సీఎంకు సాదర స్వాగతం





వాణిజ్యవేత్తల సదస్సుకు విశాఖ వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి హెలిప్యాడ్ వద్ద స్వాగతం పలుకుతున్న పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు, పాయకరావుపేట సమన్వయకర్త ఎమ్మెల్యే కంబాల జోగులు

రాష్ట్ర స్థాయికి ఎంపికైన ఉపాధ్యాయినికి సత్కారం



ఉప్పరాపల్లి పాఠశాలలో ఉపాధ్యాయులను సత్కరిస్తున్న దృశ్యం

ఎస్.రాయవరం: ఏపీ పాఠశాలలో ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ మైండ్‌సెట్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌కి రాష్ట్ర స్థాయికి ఎంపికైన ఉప్పరాపల్లి ఉపాధ్యాయురాలు బొజ్జా అరుణ త్రివేణిని పీఆర్‌టీయు మండలశాఖ అధ్యక్షుడు భద్రరావు ఘనంగా సత్కరించారు. ఉప్పరాపల్లి పాఠశాలలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఉపాధ్యాయినితో పాటు ప్రోత్సాహం అందించిన ఇన్‌చార్జి హెచ్ఎంను పీఆర్‌టీయూ నాయకులు సత్కరించారు. గ్రామీణ ప్రాంత పాఠశాల ఉపాధ్యాయులు ప్రభుత్వం విద్యాశాఖలో ఏర్పాటు చేస్తున్న నూతన కార్యక్రమాలకు ఎంపిక కావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు కె.సంపత్, పీఆర్‌టీయు జిల్లా అధ్యక్షుడు గోపినాథ్, ప్రధాన కార్యదర్శి పెద్దినాయుడు, వర్కింగ్ ప్రెసిడెంట్ విశ్వేశ్వర రావు, ఎస్.రాయవరం మండల కార్యదర్శి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

413 మందికి ఉచిత వైద్య పరీక్షలు



వైద్య బృందంతో ఎంపీపీ, జెడ్పీటీసీ



రోగులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

పాయకరావుపేట : పాల్తేరు గ్రామంలో 413 మందికి వైద్య సిబ్బంది వైద్య పరీక్షలు నిర్వహించారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం రెండో విడతలో భాగంగా శ్రీరాంపురం పీహెచ్‌సీ వైద్య బృందం వైద్య పరీక్షలు నిర్వహించారు. ముందుగా రోగులను ఆన్‌లైన్ ద్వారా పేర్లు నమోదు చేసుకున్నారు. వైద్యులు ఎస్.శిరీష, కె.రవికిరణ్, వై.తులసీ నవీన రోగులకు సాధారణ వైద్య పరీక్షలు, ఆర్థోపెడిక్ సమస్యలు, గుండెకు సంబంధించిన సమస్యలు, బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి గుండెకు ఈసీజీ పరీక్షలు నిర్వహించారు. రక్త పరీక్షలు ఆధారంగా మందులు పంపిణీ చేశారు. మెరుగైన వైద్య సేవలు అవసరమైన వారికి ఆరోగ్యశ్రీ ద్వారా కార్పొరేట్ ఆస్పత్రులకు వెళ్లి వైద్య సేవలు పొందే విధంగా సూచనలు, సలహాలు అందించారు. కంటి రోగులకు కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. స్త్రీలకు గర్భాశయ పరీక్షలు నిర్వహించారు. కాళ్ళు, చేతుల నొప్పులు గల రోగులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ లంక సూరిబాబు, ఎంపీపీ ఇసరపు పార్వతీ తాతారావు, సర్పంచ్ గోసల కృష్ణ, ఎంపీటీసీ ఇసరపు సత్యనారాయణ, నియోజకవర్గ సోషల్ మీడియా ఇన్‌చార్జ్ రామకృష్ణ, పార్టీ నాయకులు దేవవరపు వెంకటేశ్వర రావు, దేవవరపు శ్రీను, వైద్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మార్కెట్ వేలం... తూతూ మంత్రం!

- కాంట్రాక్టర్ల సిండికేట్
- పురపాలక ఆదాయానికి భారీగా గండి
- అధికారులను నిలదీసిన సభ్యులు
- వేలం రద్దుకు డిమాండ్



మున్సిపల్ అధికారులను నిలదీస్తున్న వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ సుంకర మరిణేశ్వర్రావు

యలమంచిలి రూరల్ : వేలంపాటదారులు సిండికేట్‌గా ఏర్పడి మార్కెట్ వేలాలు దక్కించుకోవడంతో పురపాలక ఆదాయానికి భారీగా గండి పడింది. మంగళవారం సాయంత్రం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ కొండలరావు ఆధ్వర్యంలో పట్టణంలోని రోజువారీ మార్కెట్, వారపు పశువుల సంత, మేకల కమేశాలకు వచ్చే ఆర్థిక సంవత్సరానికి సంబంధించి వేలంపాట నిర్వహించారు. అయితే దీనిపై ముందుగా ప్రచారం చేయకపోవడం, కేవలం నలుగురు పాటదార్లే హాజరవడం, వారంతా ముందుగానే సిండికేట్ అవడంతో పురపాలక ఆదాయానికి గండి పడింది. వాస్తవానికి మార్కెట్ వేలం ద్వారా మున్సిపాలిటీకి భారీగా ఆదాయం వచ్చే అవకాశం ఉన్నప్పటికీ అధికారులు నిబంధనలు పక్కనపెట్టి కాంట్రాక్టర్లకు సహకరించారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నిబంధనల ప్రకారం వేలంపాటలో పాల్గొనే వారు రూ.5 లక్షలకు సరిపడా సాల్వెన్సీతో పాటు మరో రూ.5 లక్షల నగదు డిపాజిట్ చేయాలి. కానీ వేలంపాటలో పాల్గొన్న వారిలో ఒక్కరే రూ.5 లక్షల నగదు డిపాజిట్ చేశారు. మిగిలిన ముగ్గుర్నీ నిబంధనలకు విరుద్ధంగా వేలంపాటలో పాల్గొనేందుకు అధికారులు అనుమతించారు. వీరంతా సిండికేట్‌గా ఏర్పడి పావులు కదిపారు. గతేడాది ఖరారైన ధరకు కాస్త అటు ఇటుగా పాడుకుని వేలం ముగించేశారు. గతేడాది రూ.24,69,740 లకు పాట ఖరారు కాగా ఈ ఏడాది రూ.24,75,640కి ఖరారైంది. అంటే కేవలం రూ.5,900 మాత్రమే పెరిగింది. మేకల కమేశా కూడా గతేడాది రూ.33,748కు ఖరారు కాగా ఈ ఏడాది రూ.34,456కు ఖరారు చేసుకున్నారు.

నిలదీసిన వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు

ప్రతి ఏటా వేలంపాట నిర్వహణపై సంచార లౌడ్ స్పీకర్ ద్వారా పుర ప్రజలకు తెలిసేలా ప్రచారం చేసేవారని, ఈ ఏడాది ఎందుకు ప్రచారం చేయలేదని వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు సుంకర మరిణేశ్వర్రావు, గొర్లి వెంకట్ మున్సిపల్ అధికారులను నిలదీశారు. వేలంపాటలో పాల్గొనే వారిలో కొందరికి అర్హతకు సంబంధించిన పత్రాలు లేకపోయినా వారిని అనుమతించడమేమిటని ప్రశ్నించారు. దీనిపై జిల్లా కలెక్టరు, పురపాలక ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు. కాగా దీనిపై మున్సిపల్ కమిషనర్ కొండలరావును వివరణ కోరగా మార్కెట్ వేలాలను గతంలో నిర్వహించిన మాదిరిగానే నిర్వహించామని, ధరావతు చెల్లించిన వారితో పాటు చెక్కులు ఇచ్చిన వారిని కూడా వేలంపాటలో పాల్గొనేందుకు అనుమతిచ్చామని తెలిపారు. గతంలో కంటే రూ.5900 అధికంగా ధర వచ్చిందన్నారు.

45 మద్యం సీసాలు స్వాధీనం

కశింకోట : కశింకోట కూడలి వద్ద అక్రమంగా తరలిస్తున్న 45 మద్యం సీసాలను మంగళవారం రాత్రి స్వాధీనం చేసుకుని గంపా మణేష్‌ను అరెస్టు చేసినట్టు ఎస్ఐ రమేష్‌బాబు తెలిపారు. స్థానిక హౌసింగ్ కాలనీలో విక్రయానికి తరలిస్తుండగా మద్యం సీసాలు పట్టుకుని స్వాధీనం చేసుకున్నామన్నారు.

ప్రభుత్వం దృష్టికి వృద్ధుల సమస్యలు

అనకాపల్లి : వృద్ధుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లనున్నట్లు జిల్లా వయోవృద్ధుల సంక్షేమ సంఘం వ్యవస్థాపకులు కాండ్రేగుల అప్పారావు అన్నారు. గవరపాలెంలోని వీవీ రమణ రైతు భారతి హాల్లో మంగళవారం సంఘ సమావేశంలో ఆయన మాట్లాడారు. వృద్ధులు రైల్లో ప్రయాణించే సమయంలో టికెట్‌లో రాయితీ ఇవ్వాలని ఆయన కోరారు. జిల్లా కేంద్రం ఏర్పడిన తర్వాత వృద్ధుల సమావేశాలు నిర్వహించేందుకు జీవీఎంసీ పరిధిలో ప్రభుత్వ అధికారులు భవనాన్ని ఏర్పాటు చేయాలన్నారు. 60 సంవత్సరాలు పైబడిన వృద్ధులకు ప్రభుత్వ రాయితీ కల్పించాలని, మారుతున్న కాలానికి అనుగుణంగా వృద్ధులకు ప్రభుత్వ పింఛన్ రూ.5 వేలు పెంచాలని కోరారు. అనంతరం 84 సంవత్సరాలు పూర్తి చేసుకున్న కాండ్రేగుల అప్పారావును సంఘం సభ్యులు సత్కరించారు.

ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

అనకాపల్లి: భవన నిర్మాణ కార్మికులకు ప్రభుత్వాలు అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నాయని బీజేపీ మోర్చా రాష్ట్ర సభ్యుడు అలమండ శ్రీను తెలిపారు. తుమ్మపాల గ్రామంలో శారద గృహనిర్మాణ కార్మిక సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భవన నిర్మాణ కార్మికులకు విశ్వకర్మ కౌశల్ యోజన, సోలార్ విద్యుత్, కార్మికులకు ఇన్సూరెన్స్ పథకాలు అమలు చేస్తున్నారని, అందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మహిళా సాధికారతకు సీఎం పెద్దపీట

మెప్మా పీడీ సరోజిని



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ కొండలరావు, చిత్రంలో మెప్మా పీడీ సరోజిని, ఇతర అధికారులు

యలమంచిలి రూరల్ : గత నాలుగున్నరేళ్లలో సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మహిళా సాధికారతకు పెద్దపీట వేశారని పట్టణ పేదరిక నిర్మూలనా సంస్థ పీడీ ఎం.సరోజిని అన్నారు. మంగళవారం సాయంత్రం యలమంచిలి పురపాలక సంఘం కార్యాలయంలో స్వయం సహాయక సంఘాల రిసోర్సు పర్సన్లు, సచివాలయ అడ్మిన్, వెల్ఫేర్ అసిస్టెంట్లతో నిర్వహించిన సమావేశంలో ఈ నెల 7వ తేదీన జరిగే ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సభను విజయవంతం చేయాలని సూచించారు. సీఎం సభకు స్వచ్ఛందంగా తరలివచ్చే మహిళలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా రిసోర్సు పర్సన్లు, సచివాలయ అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. యలమంచిలి పట్టణానికి సంబంధించి 7 బస్సులు, 573 ఆటోలు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. మహిళలను స్వచ్ఛందంగా సభకు తరలివచ్చేలా చైతన్య పరచాల్సిన బాధ్యత మెప్మా సిబ్బంది, ఆర్పీలపై ఉందన్నారు. అలాగే వారికి రవాణా, భోజన, తాగునీటి ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. మున్సిపల్ కమిషనర్ కొండలరావు మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులు నిర్లక్ష్యం చూపకుండా విధుల్లో బాధ్యతగా వ్యవహరించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్లు అర్రెపు గుప్తా, బెజవాడ నాగేశ్వర్రావు,మున్సిపల్ మేనేజరు ప్రభాకర్రావు,మార్కెట్ కమిటీ చైర్మన్ బొద్దపు ఎర్రయ్యదొర, మెప్మా సీఎంఎం డి.పద్మావతి, సీవో ఉమ,సీఎల్ఆర్‌పీ కృష్ణవేణి, రెవెన్యూ అధికారి నీలిమ, పలువురు వార్డు కౌన్సిలర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జెడ్పీటీసీ స్వామి సత్యనారాయణ

సీఎం పర్యటనను విజయవంతం చేయాలి

మునగపాక : ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి పర్యటనను విజయవంతం చేయాలని జెడ్పీటీసీ సభ్యుడు పెంటకోట స్వామి సత్యనారాయణ కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సీసీలు, సీపీలతో ఆయన మంగళవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 7వ తేదీన అనకాపల్లి నియోజకవర్గం పిసినికాడ పంచాయతీ పరిధిలో జరగనున్న వైఎస్సార్ చేయూత కార్యక్రమానికి జగన్‌మోహన్‌రెడ్డి వస్తున్నారన్నారు. ఇందుకోసం మండలంలోని డ్వాక్రా మహిళలు పెద్ద సంఖ్యలో హాజరయ్యేలా చూడాలన్నారు. ఎన్నికల ముందు మహిళలకు ఇచ్చిన హామీలో భాగంగా ఈ ఏడాది రూ.18750 మేర నగదును నేరుగా వారి ఖాతాల్లోకి జమ చేసేందుకు నిర్వహించనున్న భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలన్నారు. వెలుగు ఏపీఎం కొండమ్మ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎంపీడీవో మన్మథరావు, ఉపాధిహామీ పథకం ఏపీవో ఎరకయ్య పాల్గొన్నారు.

వలంటీర్ల సేవలు ఎంతో కీలకం



గ్రామ వలంటీర్లను అభినందిస్తున్న వీఆర్వో, కార్యదర్శులు

ఎస్.రాయవరం : అర్హులకు ప్రభుత్వ పథకాలు అందివ్వడంలో గ్రామ వలంటీర్ల సేవలు అభినందనీయమని కొరుప్రోలు సచివాలయ వీఆర్వో శ్రీధర్, కార్యదర్శి ఎస్.రామలక్ష్మి అన్నారు. సచివాలయంలో మంగళవారం సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలు, కేటాయించిన సమయానికి ప్రజల చేత దరఖాస్తు చేయించి, వారికి పూర్తి స్థాయిలో అందించేలా వలంటీర్లు కీలక బాధ్యత వహిస్తున్నారన్నారు. మండల కేంద్రం నుంచి వస్తున్న ఆదేశాల మేరకు సకాలంలో పనిచేసి సచివాలయ సేవలు పూర్తి స్థాయిలో ప్రజలకు చేరేలా చేస్తున్నారని పేర్కొన్నారు. గ్రామంలో ఇద్దరు వలంటీర్లు ఉత్తమ సేవలకు గాను వరుసగా రెండేళ్లు సేవారత్న అవార్డులు దక్కించుకున్నారన్నారు. ఈ మేరకు వలంటీర్లకు, వారికి తోడ్పాటు నిస్తున్న సచివాలయ సిబ్బందికి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది చంద్రశేఖర్, మహేశ్వరి, వలంటీర్లు ఎస్.కె.అమెజాన్, పినపాత్రుని రజని, యమున, లక్ష్మి, పృధ్వీ, జేమ్స్ పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్ష ద్వారా ప్రజలకు భరోసా



శిబిరంలో పేర్లను నమోదు చేసుకుంటున్న దృశ్యం



వెంకటాపురం సురక్ష శిబిరంలో వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ విమలగిరి

మునగపాక: జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ప్రజల ఆరోగ్యానికి భరోసా కలుగుతుందని వెంకటాపురం సర్పంచ్ సుందరపు తాతాజీ అన్నారు. వెంకటాపురంలో మంగళవారం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వైద్యానికి పెద్దపీట వేస్తున్నారన్నారు. ప్రతి గ్రామంలో ఇటువంటి శిబిరాలు ఏర్పాటు చేయడం ద్వారా ప్రజల ఆరోగ్యంపై దృష్టి సారిస్తున్నారన్నారు. నిష్ణాతులైన వైద్యులు సేవలందించే ఇటువంటి శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అలాగే 140 రకాల మందులు అందుబాటులో ఉంటాయన్నారు. వైద్యాధికారులు విమలగిరి, శ్రీవల్లి, ఎంపీడీవో మన్మథరావు వైద్య సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.

తలుపులమ్మ లోవలో సర్పంచ్‌ల సందడి



తలుపులమ్మ లోవలో కలుసుకున్న మునగపాక మండల సర్పంచ్‌లు

మునగపాక : మండలంలోని పలువురు సర్పంచ్‌లు మంగళవారం తూర్పు గోదావరి జిల్లా తలుపులమ్మ లోవలో సందడి చేశారు. సర్పంచ్‌లుగా ఎన్నికైన నాటి నుంచి ఇంతవరకు పిక్నిక్ నిర్వహించాలని ఆలోచన చేసినా కార్యరూపం దాల్చలేదు. దీంతో వాడ్రాపల్లి సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత దాసరి అప్పారావు ఒకడుగు ముందుకేసి పంచాయతీ సర్పంచ్‌లతో సమావేశం నిర్వహించారు. మండల అభివృద్ధిలో సర్పంచ్‌లు భాగస్వాములు కావాలని, ప్రభుత్వం ద్వారా వచ్చే నిధులను సద్వినియోగం చేసుకొని ప్రజా సమస్యల పరిష్కారానికి పాటు పడాలని సూచనలు చేశారు. పెండింగ్‌లో ఉన్న నిధుల సమస్యను అధికారుల దృష్టికి తీసుకువెళ్లాలని నిర్ణయించారు. కాగా ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆటపాటలతో ఉత్సాహంగా గడిపి మధ్యాహ్నం సహపంక్తి భోజనాలు చేశారు.

సురక్ష శిబిరాలతో ప్రజలకు సంపూర్ణ ఆరోగ్యం



ఏటికొప్పాకలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఎంపీడీవో అప్పలనాయుడు

యలమంచిలి : జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు ఎంతో మేలు చేకూర్చుతుందని యలమంచిలి ఎంపీడీవో అప్పలనాయుడు అన్నారు.యలమంచిలి మండలం ఏటికొప్పాక గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష ఫేజ్2 లో భాగంగా నిర్వహిస్తున్న కార్యక్రమాన్ని ఎంపీడీవో అప్పలనాయుడు ప్రజాప్రతినిధులతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన మలివిడత జగనన్న ఆరోగ్య శిబిరాల్లో వృద్ధులకు ఆరోగ్య సమస్యలు పరిష్కారమవుతున్నాయని, ప్రతి ఒక్కరూ జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏటికొప్పాక గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు, వైద్య సిబ్బంది, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.